క్లుప్తంగా

పక్షవాతానికి ఉచిత చికిత్స

కాచిగూడ: శ్యామ్‌మందిర్ సేవ సమితి ఆధ్వర్యంలో పక్షవాతానికి ఆధునిక పరికరాలతో ఉచిత చికిత్స అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్యామ్‌మందిర్ ప్రాంగణంలోని ఉచిత ఫిజియోథెరపీ సెంటర్‌లో పక్షవాతానికి అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కీళ్ల,మోకాళ్లు,మెడ, నడుము నొప్పుల నివారణకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. సెల్: 9949238492 ను సంప్రదించాలన్నారు.

పదిలో ప్రతిభ కనబరిచిన గీతాంజలి విద్యార్థులు

చిక్కడపల్లి : పదోతరగతి పరీక్షల ఫలితాల్లో అశోక్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీకి చెందిన గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులందరూ.. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.శాంత వివరించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. చంద్రకౌశిక్ 10/10, కిశోర్, దినేశ్ 9.8 , గాయత్రి, శ్రేష్ఠ 9.7 పాయింట్లు సాధించారన్నారు. 41 ఏళ్ల నుంచి విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారన్నారు.

'స్వార్థ రాజకీయాల కోసమే లింగాయత్ ర్యాలీ'

కవాడిగూడ: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 4న లింగాయత్ మహార్యాలీ పేరుతో కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో లింగాయత్‌లు ఎవరు పాల్గొనవద్దని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ చైర్మన్ మాడపు వీర మల్లేష్ లింగాయత్‌లకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 'కర్ణాటక, మహారాష్ట్రలో కొంతమంది లింగాయత్‌లు స్వతంత్ర ధర్మం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ ర్యాలీ నిర్వహించి అల్లర్లు చేయడానికి ప్రయత్నిస్తున్నారని' ఆరోపించారు. ఈ ర్యాలీలో ఎవరు పాల్గొనవద్దని లింగాయత్ సమాజం మధ్య బేదాభిప్రాయాలు సృష్టించి విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లింగాయత్‌ల అభివృద్ధికి సహకరిస్తుందని లింగాయత్‌లను ఓబీసీలుగా ప్రకటించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, మేరు సంఘాల ప్రతినిధులు

కవాడిగూడ: కేసీఆర్ ప్రభుత్వం తక్షణమే బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కో బీసీ కుటుంబానికి రూ. 10 లక్షల సాయం అందించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మేరు కార్పొరేషన్‌కు వేయి కోట్ల నిధులు కేటాయించి మేరు కులస్తులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయాలన్నారు. బీసీడీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మేరు కులస్తులను మార్చాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతరించి పోతున్న మేరు కులవృత్తిని ప్రభుత్వం కాపాడాలని మేరు వృత్తిదారులకు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ మేరు గుర్తింపు సంఘాల ఐక్యవేదిక, జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్తాధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మద్దతు ప్రకటించారు. మేరకులస్తుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ మేరు సంఘాల ఐక్యవేదిక జేఏసీ చైర్మన్ మునిగాల రాము మేరు, జంటనగరాల చైర్మన్ సింగ్ విష్ణు, ఉత్తర తెలంగాణ జిల్లాల చైర్మన్ వెన్ను లింబాద్రి, దక్షిణ తెలంగాణ జిల్లాల చైర్మన్ కీర్తి జయంత్‌కుమార్, వైస్ చైర్మన్‌బాలకొండ రవితేజలు మాట్లాడారు.మేరు కులవృత్తిదారులకు ఐదు లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, బట్టలు కుట్టే టెండర్స్ మేరు కులవృత్తిదారులకే ఇవ్వాలని మేరు కులవృత్తిదారులు నిర్వహిస్తున్న టైలర్ షాపులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు నిఫ్ట్ ద్వారా బోటిక్ ట్రైనింగ్ ఇచ్చి సబ్సిడీ రుణాల ద్వారా బోటిక్ షాపులు పెట్టుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు కొండ ప్రకాష్,వేణు, నోముల శాంతికుమార్, వేణురాజు, గట్ల యుగేందర్, శ్రీనివాస్, లవణ్‌కుమార్, కర్ణిరాజు, వెంకటేశ్వర్లు, మునగాల విజయలక్ష్మి, లత, శీలం కోటి, అనుపమ, సంతోష తదితరులున్నారు.

'చూమంతర్ మ్యాజిక్ ఆసియా–2023' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: మ్యాజిషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10,11 తేదీల్లో సికింద్రాబాద్, హరిహర కళాభవన్‌లో నిర్వహించనున్న ‘చూమంతర్ మ్యాజిక్ ఆసియా –2023’ పోస్టర్‌ను శనివారం బర్కత్‌పురలో కన్వెన్షన్ చైర్మన్ సామల వేణుతో కలిసి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే మ్యాజిక్ కన్వెన్షన్‌కు హాజరు కావాలని కోరుతూ కేంద్రమంత్రికి సామలవేణు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 500 మందికి పైగా మ్యాజిషియన్స్ ఈ కన్వెన్షన్‌లో పాల్గొంటారన్నారు. వివిధ అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రజలకోసం మ్యాజిక్ లైవ్ షో ఉంటుందన్నారు. మ్యాజిషియన్స్ రఘుబాబు, పూర్ణచందర్ తదితరులున్నారు.

వీరన్నగుట్ట రోడ్డు ప్యాచ్‌వర్క్స్..


పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్

కాచిగూడ: వీరన్నగుట్ట బస్తీలో ర్యాంప్ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారి ప్రమాదకరంగా ఉండటంతో ఇటీవల ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బస్తీలో పర్యటించిన సందర్భంగా స్థానికులు రోడ్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై ప్యాచ్‌వర్క్స్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ పనులను పర్యవేక్షించారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, బస్తీ నేతలు దినేష్, విజయ్ తదితరులున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదరణ గణనీయంగా పెరిగిందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్లు కల్పనాయాదవ్, వాజీద్‌హుస్సేన్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగపాక వెంకట్, టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్, నగర ఉపాధ్యక్షులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, లింగంగుప్తా, నాయకులు అభిషేక్ కెనడీ, వీ.డీ.కృష్ణ, అంజియాదవ్, గుర్రం శంకర్, లక్ష్మణ్, ప్రభాకర్, ధర్మేందర్ తదితరులున్నారు.

'దశాబ్ది వేడుకలను బహిష్కరించాలి'

కవాడిగూడ: తెలంగాణ దశాబ్ది వేడుకలను బహిష్కరించాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దోమలగూడలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 9 ఏళ్ల పాలనలో బీసీలకు చేసింది ఏమిలేదని.. ఆరోపించారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 18 శాతానికి తగ్గించారన్నారు.

రాజకీయ లబ్ధికోసమే కులగణనకు కేంద్రం వెనకడుగు


రాజేందర్‌పటేల్ గౌడ్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే కుల గణనకు వెనుకడుగు వేస్తుందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. శనివారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..బీసీలందరికీ సమన్యాయం కోసం కేంద్రం బీసీ జాబితా వర్గీకరణకు 2017 లో నియమించిన జస్టిస్ రోహిణి కమీషన్ నేటికి నివేదిక ఇవ్వకపోయినా.. కేంద్రం పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీసీ నేతలు నల్లెల కిషోర్, భూషణ్ భాస్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, ఖుర్షీద్ అలీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు


గాధగోని రవి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు వరంగల్‌జిల్లా నర్సంపేట్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గాధగోని రవి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ ప్లీనరీ సమావేశాల్లో జాతీయ, రాష్ట్రంలో నెలకొనబడిన తాజా రాజకీయాలపై చర్చ జరుగుతుందన్నారు. 25 జిల్లాల నుంచి ఎంపిక చేయబడిన 350 ప్రతినిధులు ఈ ప్లీనరీ సమావేశాల్లో పాల్గొంటారన్నారు. మొదటిరోజు 4న మధ్యాహ్నం నుంచి నర్సంపేట పట్టణంలో ప్రజాప్రదర్శన, భారీ బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. ఈ సదస్సులో పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయల ఓంకార్, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు కే.కే.రేమా, పోలిట్‌బ్యూరో సభ్యులు సెలినా, కాటం నాగభూషణం, వల్లెపు ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో వసతి కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్ రావు ప్రకటించారు. శనివారం ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు, ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీబీఎస్, ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ, బీటెక్, బీఈ, హోటల్ మేనేజ్‌మెంట్, సీఏ, బీఎస్సీ, బికాం, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్ తదితర కోర్సులు చదివే జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అసక్తిగల అభ్యర్థులు ధ్రువీకరణపత్రాలతో ఈనెల 5 నుండి 29వ తేదీ వరకు కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పార్కుల అభివృద్ధికి కృషి


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు

అంబర్‌పేట: నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధి, పచ్చదనానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఉన్న పార్కును రూ.30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ఉన్న పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు..

కాచిగూడ: ముషీరాబాద్, గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వీరమల్ల చంద్రశేఖర్ కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు దాతల సాయం కోసం అర్థిస్తున్నాడు. వైద్యానికి రూ.30 లక్షలు కడితే గానీ బ్రతికే అవకాశం లేదని కనీసం రూ.3 వేలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో అతడు ఉన్నట్లు సమాచారం. దాతలెవరైనా ఉంటే సాయం చేయాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు. ఎవరైనా సాయం చేయాలనుకుంటే సెల్: 6300926453 నంబరును సంప్రదించాలని కోరుతున్నారు.

ప్రతిభా పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అవోపా బ్యాంక్‌మెన్ చాప్టర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023లో తెలంగాణలో ఎంసెట్, నీట్, జేఈఈ (అడ్వాన్స్), సివిల్స్‌లో వేయిలోపు ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ కన్వీనర్లు టీఎల్ వీరావు, డాక్టర్ కత్త రామానందం, అధ్యక్షుడు పీవీ. రమణయ్యలు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కాచిగూడలోని వైశ్యహాస్టల్ ఆడిటోరియంలో జూన్ 18న జరిగే కార్యక్రమంలో వారిని బంగారుపతకాలతో సన్మానిస్తామని పేర్కొన్నారు.

జాతీయోద్యమ ఆకాంక్షల సాధనకు ఉద్యమించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జాతీయోద్యమ ఆకాంక్షల సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకిత భావంతో ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీనియర్ జర్నలిస్టు బోజ్జ భిక్షమయ్య పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘భారత్ బచావో’ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామిక లౌకిక విలువలను కాపాడుకోవడానికి మేధావులు, ఉద్యమకారులు, స్వచ్ఛంద సంస్థలు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. విద్య, వైద్య, ఉపాధిరంగాలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. భారత్ బచావో జాతీయ నాయకులు ఇన్నయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వివిధ సంఘాల నాయకులు రాంబాబు తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకం

కాచిగూడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ సూచించారు. శనివారం కాచిగూడ డివిజన్ చెప్పల్ బజార్, ఇందిరానగర్, మౌలానా అజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీకేంద్రాల్లో అమలవుతున్న ఆరోగ్యలక్ష్మి పథకాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. పిల్లలు, గర్భిణీలకు పోషకాహారాన్ని అందించేలా అంగన్‌వాడీ టీచర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, అరుణ, రమాదేవి తదితరులున్నారు.

బడిబాట ప్రారంభం..

◆ ప్రతి ఇంట్లోని చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూపర్‌వైజర్ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యరక్షణకు, విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పౌష్టికాహారం అందించడం తదితర సేవలను అందిస్తామన్నారు. 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లున్న పిల్లలను పంపించాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ,ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ శివరాణి, ఆశా స్వరూప, అనిత తదితరులున్నారు.

మంత్రి హరీష్‌రావుకు శుభాకాంక్షలు


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న దూసరి శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: రాష్ట్ర, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుకు పలువురు అంబర్‌పేట బీఆర్‌ఎస్ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో అంబర్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ మొక్కను బహూకరించారు.

బీసీ విద్యార్థులకు 10 వేల ర్యాంకు నిబంధన ఎత్తివేయాలి


జిల్లాపెల్లి అంజి

కాచిగూడ: ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రభుత్వం 10వేల ర్యాంకు నిబంధన ఎత్తివేసి పూర్తి ఫీజులు ఇవ్వాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజి డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివే బీసీ విద్యార్థులకు రూ. 20వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న 5.77లక్షల మందికి తక్షణమే రుణం మంజూరు చేయాలని కోరారు. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు కమీషనర్‌ను, బీసీ గురుకులాలకు సెక్రటరీగా ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. బీసీ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రభుత్వంపై బీసీ విద్యార్థులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.

నత్తనడకన స్టీల్ బ్రిడ్జ్ పనులు !



చిక్కడపల్లి: లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్టీ వరకు కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతుండటంతో రోజూ ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్డు వరకు రద్దీ అధికంగా ఉంటుంది. దుకాణదారులు, టిఫిన్ సెంటర్లు, హాస్టళ్లు, నివాసాలు, సినిమా థియేటర్లు ఉండడంవల్ల అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డు వరకు రోడ్డును అధికారికంగా మూసేసినా వాహనాల రాకపోకలు కొనసాగుతూనే ఉన్నాయి. షాపులకు కొనుగోళ్లకోసం వచ్చేవారు తమ ద్విచక్రవాహనాలను రోడ్డుపక్కనే పార్కింగ్ చేస్తుంటారు. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంతో ఎలాంటి ప్రమాదం జరుగుతోందని భయాందోళన చెందుతున్నారు. వెంటనే స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా నిర్మాణం పూర్తిచేయాలి

మూడేళ్లుగా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోంది. త్వరగా నిర్మాణం పూర్తిచేయాలి. కరోనా సమయంలో వ్యాపారాలు సాగక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం అధికారికంగా రోడ్డును మూసేశారు. బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోంది. త్వరగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తేనే వ్యాపారాలు కొనసాగించుకునే అవకాశం ఉంటుంది. లేదంటే వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మరే ప్రమాదం ఉంది.

– రమేశ్‌గాంధీ, జవహర్‌నగర్ ఫెడరేషన్ ప్రతినిధి

పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలి



డాక్టర్లకు మెమోంటో అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, పాస్టర్ శ్యామ్‌అబ్రహం

ముషీరాబాద్: వ్యాపార దృక్పదంతో కాకుండా సేవాభావంతో కార్పొరేట్ వైద్య సంస్థలు పేద ప్రజలకు సామాజిక బాధ్యతతో ఉచిత వైద్యసేవలు అందించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని ప్రేయర్ పవర్ చర్చిలో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్ వైద్య సంస్థలు పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు ప్రభుత్వం అందిస్తోందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చర్చి ప్రతినిధి బ్రాణహం, బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, డాక్టర్లు మొహియుద్దీన్, రవిచంద్ర, సుజిత్ కుమార్, సయ్యద్ అబ్దుల్‌అలీ, స్వాతి, కేర్ ఆసుపత్రి మేనేజర్ సతీష్ తదితరులున్నారు.